

ఉత్సాహంగా స్కిప్పింగ్ పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు స్కిప్పింగ్ పోటీలను నిర్వహించారు. సుమారు 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు నేపథ్యంలో ప్రభుత్వం విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తుందని, వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిని సునీత కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆడుతున్న విద్యార్థులు

భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు : స్థానిక డిగ్రీ కళాశాలలో ఈవీఎంల భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత బుధవారం సందర్శించారు. అరకు అసెంబ్లీ నియోజకవర్గం, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం, అరకు పార్లమెంట్ నియోజకవర్గం స్ట్రాంగ్ రూములను పరిశీలించి భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కౌంటింగ్ హాల్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. ప్రధాన రహదారిలో అదనపు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ ఏజెంట్లకు, అభ్యర్థులకు టాయిలెట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉదయం అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వి అభిషేక్ పాడేరు రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ భావన వసిస్ట్ స్ట్రాంగ్ రూములను సందర్శించారు. లాగ్ బుక్ లో సంతకాలు చేశారు ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ప్రతాప్ శివ కిషోర్, ధీరజ్,జిల్లా రెవెన్యూ అధికారి బి. పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వివిఎస్ శర్మ , పాడేరు తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి , డి పి ఆర్ ఓ పి. గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.


స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ఎస్ ప్రశాంత్ కుమార్

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పటిష్ట భద్రత

- రంపచోడవరం నియోజకవర్గం ఆర్ఒ ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు కేంద్రాలలో పటిష్టమైన భద్రత వలయంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో ఆయన మాట్లాడుతూ రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలికల జూనియర్ కాలేజీలో అసెంబ్లీకి, పార్లమెంటుకు వేరువేరుగా కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్లమెంటుకు 20 కౌంటింగ్ టేబులు, అసెంబ్లీకి 20 కౌంటింగ్ టేబుల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పార్లమెంటు, అసెంబ్లీకి వేరువేరుగా ఒక్కొక్క టేబుల్ కు నలుగురు చొప్పున కౌంటింగ్ సిబ్బంది ఉంటారన్నారు. అసెంబ్లీకి 80 మంది, పార్లమెంటుకు 80 మంది కౌంటింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసిన 12 మంది అభ్యర్థులు ఒక్కొక్క టేబుల్‌కు ఒక్కొక్క ఏజెంట్‌ను నియమించవచ్చని పేర్కొన్నారు. రెవిన్యూ శాఖ నుండి మరో 200 మంది అధికారులను సిబ్బందిని కౌంటింగ్ విధుల కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంత మైన వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించడానికి కౌంటింగ్ రోజున కౌంటింగ్ కేంద్రం చుట్టుపక్కల ప్రతిష్టాత్మకమైన భద్రతతో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని వెల్లడించారు.

ద్విచక్ర వాహనం అపహరణ

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం రింతాడ పంచాయతీ పరిధి మల్లుమెట్ట గ్రామానికి చెందిన సొమ్ముల శివాజీకి చెందిన ఎపి 39ఎల్‌బి 8634 నెంబర్ గల పల్సర్ బైక్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. రింతాడ గ్రామం నక్షత్ర ఫోటో స్టూడియో ముందు తన మిత్రుడు సాకేరి చంద్రశేఖర్ మంగళవారం రాత్రి బైక్ పెట్టి నిద్రపోయాడు. గుర్తుతెలియని అగంతకులు హ్యాండ్ లాక్ ఉన్న బైక్‌ని చాకచక్యంగా అపహరించుకుపోయారు. దీనిపై జీకే వీధి పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేశారు.

సీలేరులో చిల్లర దొంగల ఆగడాలు

జీకే వీధి మండలం సీలేరులో చిల్లర దొంగల ఆగడాలు రోజురోజుకి హద్దు మీరుతున్నాయి. నిన్న మొన్నటి వరకు దుకాణాల్లో చొరబడి తినుబండారాలు, డబ్బులు అపరించకపోయే సంఘటనలు చోటుచేసుకోగా, ఇటీవల బైకుల నుండి పెట్రోల్ చోరీ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం సీలేరు ఏబీఎన్ రిపోర్టర్ ఎం. రమణ, మెకానిక్ ఈశ్వరరావు ద్విచక్ర వాహనాల నుండి గుట్టుచప్పుడు కాకుండా చాకచక్యంగా పెట్రోల్ చోరీ చేశారు. బైక్ యజమానులు బైక్ తాళం తీసి నడిపేందుకు ప్రయత్నించగా పెట్రోల్ లేక బండి స్టార్ట్ కాకపోవడంతో వారు కంగుతిన్నారు. చిల్లర దొంగలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చిల్లర దొంగలు ఆగడాలు అరికట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రుతు క్రమంలో..

కౌమార బాలికలు శుభ్రతను పాటించాలి

ఆర్‌జెడి చిన్మయిదేవి

ప్రజాశక్తి-పాడేరు : కౌమార బాలికలలో ప్రతినెలా వచ్చే రుతుక్రమం సమయంలో అత్యంత పరిశుభ్రంగా ఉండాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పి. చిన్మయి దేవి సూచించారు. బుధవారం స్థానిక పిఎంఆర్సి భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన మాసిక మహోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌జెడి మాట్లాడుతూ, నెలవారీ వచ్చే ఋతుస్రావంలో కడుపు నొప్పి రావడం, నీరసంగా ఉండటం, వాంతులు, విరేచనాలు వంటివి వచ్చినపుడు వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. ప్రతి మూడు గంటలకు శానిటరీ రాపర్ మార్చుకోవాలని, పోషకాహారం తీసుకుంటూ సమతుల్య ఆహారం తీసుకుంటే ఋతుస్రావంలో వచ్చే రుగ్మతల నుండి బయట పడవచ్చని వివరించారు. కౌమార బాలికలలో పోషకారహార, ఐరన్ లోపం, రక్తహీనత అధికంగా ఉంటే పాలు, గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, మాంసాహారం సమపాలలో తీసుకోవాలని అని కోరారు..

వైద్యురాలు శాంతి మాట్లాడుతూ, కౌమార బాలికలలో ఋతుస్రావం సమయంలో ఇంట్లోకి రానివ్వకపోవడం, ఏ వస్తువులను తాకనివ్వకపోవడం వంటి దుష్ప్రభావాలు గ్రామాలలో ఉన్నాయని తెలిపారు. వీటి గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి మాట్లాడుతూ, ఋతుక్రమం ప్రతినెలా ఎల్ఎంపి నుండి 28 రోజుల తరువాత నెలసరి సరిగా వస్తున్నదీ, లేనిదీ తనిఖీ చేయించుకోవాలని సూచించారు. కౌమార బాలికలు మంచి పోషక విలువల ఆహారాన్ని, మాంసాహారాన్ని, పండ్లు, ఆకుకూరలు రోజూ తీసుకొనే ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు.

హుకుంపేట:

ఋతు క్రమంలో అత్యంత పరిశుభ్రత అవసరమని సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి అన్నారు. కౌమార బాలికలలో ప్రతినెలా వచ్చే రుతుక్రమం సమయంలో అత్యంత పరిశుభ్రంగా ఉండాలని సూచించారు.బుధవారం సంతారి పంచాయతీ అంగన్వాడీ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బాలికలలో ప్రతినెలా వచ్చే రుతుక్రమం గురించి, ఆ సమయంలో పాటించవలసిన పరిశుభ్రత గురించి వివరించారు. కౌమార బాలికలలో పోషకారహారం, ఐరన్ లోపం, రక్తహీనత అధికంగా ఉండడం వంటివి ఇటీవల రోజుల్లో ఎక్కువగా ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఏ ఏ ఎం చంద్రమ్మ, ఎంఎల్‌హెచ్ పి.లావణ్య పాల్గొన్నారు.



పాడేరులో మాట్లాడుతున్న ఆర్‌జెడి చిన్మయిదేవి


హుకుంపేటలో ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

బాణం దెబ్బకు గిరిజనుడు బలి

-ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీ సొనియాపై బాణంతో దాడి చేసిన బాబ్జి

-ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయిన సొనియా

-పరారైన నిందితుడు

ప్రజాశక్తి- చింతపల్లి :బాణం వేసి గిరిజనుడిని హతమార్చిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ పెడకొండ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... ఉపాధి హామీ పనులు చేసుకుంటున్న వంతల సొనియా (53)పై అదే గ్రామానికి చెందిన కాకూరి బాబ్జి బాణంతో దాడి చేశాడు. గుండెలపై బాణం గుచ్చుకోవడంతో వంతల సొనియా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దాడి చేసిన బాబ్జి పరారయ్యాడు. సొనియా కుమారుడు రామారావు ఫిర్యాదు మేరకు అన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతపల్లి ఆసుపత్రికి పోలీసులు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.


బాణం తగిలి మృతిచెందిన సొనియా


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వంతెన నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి -అనంతగిరి:అనంతగిరి పంచాయతీ పెద్దూరు మాలింగువలస గ్రామాలకు ఆనుకున్ని రోడ్డు వంతెన నిర్మాణ పనులకు గిన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డిఇ సుబ్బారావు మాట్లాడుతూ, పంచాయతీ పరిది పెద్దురు నుండి పెదబయలు మొయిన్ రోడ్డు ఆనుకుని ఉన్న గ్రామాల రింగ్ రోడ్డు వంతెన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సుమారు 13 కిలోమీటర్లు ఉన్న రోడ్డును త్వరలో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే లుంగపర్తి, వాలసీ, వేంగడ, పైనంపాడు పంచాయితీ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవడానికి అతి దగ్గర అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఇ గణేష్, వర్క్ ఇన్స్పెక్టర్ శివ పాల్గొన్నారు.

కూలీల ఐక్యతతో దిగొచ్చిన కాంట్రాక్టర్లు

కూలి రేట్లు పెంపునకు అంగీకారం


డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులకు వెళ్లడానికి సిద్ధమవుతున్న కూలీలు

ప్రజాశక్తి -సీలేరు : పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరుతూ ఎపి జెన్కో పరిధిలోని కాంట్రాక్టర్ల వద్ద పనులు చేసే దినసరి కూలీలు ఐక్యంగా చేసిన పోరాటానికి కాంట్రాక్టర్లు దిగొచ్చారు. మహిళా కార్మికులకు రోజు కూలి రూ.500, పురుషులకు రూ.550 ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో దిగు సీలేరు డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులకు బుధవారం కూలీలు హాజరయ్యారు.

ఏపీ జెన్కో కాంట్రాక్టర్ల వద్ద పని చేస్తున్న దినసరి కూలీలకు పదేళ్లుగా పురుషులకు రోజు కూలి రూ.300, స్త్రీలకు 250 ఇస్తున్నారు. అయితే అన్నింటి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా తమ కూలి రేట్లు పెంచాలని కోరుతూ మంగళవారం నుండి జరగాల్సిన పవర్ కెనాల్ మరమ్మతు పనులకు వెళ్లకుండా నిరసన తెలిపారు. వీరికి సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చింతా రాంబాబు అండగా నిలవడంతో వారి బలం మరింత పెరిగింది. రోజు కూలి పురుషులకు రూ.600, స్త్రీలకు రూ.500 ఇవ్వాలని కూలీలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగిన చర్చల్లో పురుషులకు రూ.450, స్త్రీలకు రూ.400 చొప్పున కూలి ఇస్తామని కాంట్రాక్టర్లు చెప్పారు. అందుకు దినసరి కూలీలు అంగీకరించకపోవడంతో మంగళవారం పనులు నిలిచిపోయాయి. కూలి రేట్లు పెంచేవరకు పనులకు వచ్చేది లేదని కూలీలు తేల్చి చెప్పారు. మరో వైపు పవర్ కెనాల్ మరమ్మతు పనులు జాప్యం జరగడానికి వీలులేదని కాంట్రాక్టర్లకు జెన్కో అధికారులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు కాంట్రాక్టర్లు దిగొచ్చి కూలి రేట్లు పెంచేందుకు ముందుకొచ్చారు. రోజు కూలి పురుషులకు రూ.550, స్త్రీలకు రూ.500 ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో దినసరి కూలీలు పనులు చేపట్టడానికి అంగీకరించారు. సమస్యలపై ఐక్యంగా పోరాడితే తమ హక్కుల్ని సాధించుకోవచ్చన్న నమ్మకం కూలీల్లో కలిగింది. తమకు అండగా నిలిచిన సిఐటియుకు కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.

ఎట్టకేలకు పవర్ కెనాల్ మరమ్మతు పనులు ప్రారంభం

సీలేరు : కూలీలకు కూలి రేట్లు పెంపునకు కాంట్రాక్టర్లు అంగీకరించడంతో ఎట్టకేలకు సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని దిగువ సీలేరు డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. డొంకరాయి పవర్ కెనాల్ నుంచి ఫోర్ బై వరకు 16 కిలోమీటర్ల మేరా సుమారు రెండు కోట్లుతో మరమ్మతు పనులు చేపట్టారు. బుధవారం రిచ్ వన్, రీచ్ టులో గ్రౌటింగు కాంక్రీట్ పనులు ప్రారంభించారు. సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, మోతుగూడెం ఓ అండ్ డ్యామ్ ఇన్చార్జి ఎస్ఇ బి.బాలకృష్ణ, దిగు సీలేరు డొంకరాయి ఈఈ సివిల్ విజయ్ కుమార్ పర్యవేక్షణలో ఈ పనులు చేపడుతున్నారు. పనుల్లో ఎటువంటి నాణ్యత లోపించకుండా కాంక్రీట్ గ్రౌటింగ్ పనులు చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనులకు ఆటంకం కలగకుండా మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ పనులు జూన్ 10 నాటికి పూర్తి చేయడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ అప్పలనాయుడు, ఏఈ కృష్ణారావు పాల్గొన్నారు.


మరమ్మతు పనులు చేస్తున్న కూలీలు, ఇంజనీరింగ్ అధికారులు

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి రంపచోడవరం

ఏజెన్సీలో 6 నుండి 18 సంవత్సరాల వయసు లోపు గల బడి బయట ఉన్న బాల బాలికలను గుర్తించి దగ్గర్లో ఉన్న పాఠశాలలో చేర్పించాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. ఈ విషయంపై బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్లో ఏజెన్సీ డీఈఓ, ఏడు మండలాల ఎంఇఒలు, సిబ్బందితో పిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని మండలాల్లో ఉన్న 6 నుండి 18 సంవత్సరాల వయసులోపు గల బాల బాలికలను గుర్తించే విధంగా ఇంటింటి సర్వే చేయాలని, ఆ నివేదిక తనకు సమర్పించాలని కోరారు. అలాగే గుర్తించిన బడి బయట ఉన్న పిల్లలందరినీ దగ్గర్లో ఉన్న ఆశ్రమ పాఠశాలలోగాని, ప్రాథమిక పాఠశాలలోగాని జూన్ 12వ తేదీ లోపు జాయిన్ చేయాలని సూచించారు. ఈ సంవత్సరం 10వ తరగతిలో ఉత్తీర్ణులైన బాలబాలికలను సంబంధిత ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో జాయిన్ చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఒక్కొక్క మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, వాటిలో జిపిఎస్ ఎన్ని, ఎయిడెడ్ స్కూల్స్ ఎన్ని, యూపీ స్కూల్స్ ఎన్ని, హైస్కూల్స్ ఎన్ని, ఎంతమంది ఉపాధ్యాయులు, ఎంత మంది మంది విద్యార్థులు ఉన్నది, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఎన్ని ఉన్నాయి తదితర వివరాలపై పిఒ ఆరా తీశారు. వీటిపై జాబితా తయారు చేసి సమర్పించాలని కోరారు. పాఠశాలలు ప్రారంభం నుండి మధ్యాహ్న భోజన పథకానికి బియ్యం సకాలంలో సరఫరా చేయాలని ఎంఇఒలు పిఒకు విజ్ఞప్తి చేయగా, అందుకు తగు చర్యల తీసుకోవడం జరుగుతుందని పిఒ చెప్పారు. ఈ సమావేశంలో ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు యస్.బాలుదొర, ఒ.మల్లేశ్వరరావు, తాతబ్బాయి దొర, పి.శ్రీనివాసరావు, బి.తమ్మారావు, యం.రామకృష్ణ, సీనియర్ సహాయకులు యన్‌యల్ అర్చన రమణి, గురుకుల ప్రిన్సిపాల్ ప్రసూన్న తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే



విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖధికారి బ్రహ్మాజీరావు

పెదబయలులో డిఇఓ పర్యటన

ప్రజాశక్తి- పెదబయలు :మండలంలో జిల్లా విద్యాశాఖధికారి బ్రహ్మాజీరావు బుధవారం సుడిగాలి పర్యటన చేసారు. జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి కొమ్ము కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో అన్ని సంక్షేమ వసతి గృహల విద్యార్థులకు పుస్తకాలు సకాలంలో అందించాలన్నారు. నాడు నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. నిధులు పూర్తిగా ఖర్చు చేయాలన్నారు. 2024- 25 విద్యా సంవత్సరానికి యాక్షన్ ప్లాన్ తయారు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు, రీషెడ్యూలింగ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వాల్తేరు డివిజన్‌లోని నౌపడ-పుండి సెక్షన్‌లో వంతెన పునర్నిర్మాణ పనుల దృష్ట్యా పలు రైళ్లు రద్దు / రీషెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రైల్వే అధికారులు ప్రకటనలో పేర్కొన్న వివరాలిలావున్నాయి... 07471 పలాస-విశాఖపట్నం ప్యాసింజర్, 07470 విశాఖపట్నం-పలాస ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 31వ తేదీన రద్దుచేశారు.

06090 సంత్రాగచ్చి-తాంబరం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ సమయం ఈ నెల 30వ తేదీ రాత్రి 23.40 గంటలకు బదులు 3 గంటలు 30 నిమిషాలు ఆలస్యంగా ఈ నెల 31 తెల్లవారుజామున 3.10 గంటలకు సంత్రాగచ్చి నుంచి బయలుదేరుతుంది. 20896 భువనేశ్వర్- రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31వ తేదీన షెడ్యూల్ సమయం 12.10 గంటలకు బదులు 1 గంట ఆలస్యంగా 13.10 గంటలకు భువనేశ్వర్ నుంచి బయలుదేరుతుంది.

06222 ముజఫర్‌పూర్- మైసూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30వ తేదీన షెడ్యూల్ సమయం 13.00 గంటలకు బదులుగా 1 గంట 15 నిమిషాలు ఆలస్యంగా 14.15 గంటలకు ముజఫర్‌పూర్ నుంచి బయలుదేరుతుంది. 06104 దిబ్రూఘర్-న్యూ నాగర్‌కోయిల్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29న షెడ్యూల్ సమయం 19.55 గంటలకు బదులు 4 గంటలు ఆలస్యంగా రాత్రి 23.55 గంటలకు దిబ్రూఘర్ నుంచి బయలుదేరుతుంది.

ఈ నెల 31, జూన్ 3 తేదీలలో కాంటాబంజీ-తిట్లాగఢ్ విభాగంలో సంబల్పూర్ డివిజన్‌లో వంతెన పునర్నిర్మాణ పనుల కారణంగా 09060 బ్రహ్మపూర్-సూరత్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31న షెడ్యూల్ సమయం 4.30 గంటలకు బదులు 1గంట 30 గంటలు ఆలస్యంగా 6.00 గంటలకు బ్రహ్మపూర్ నుంచి బయలుదేరుతుంది. 08528 విశాఖపట్నం-రాయ్‌పూర్ ప్యాసింజర్ షెడ్యూల్ సమయం 6.30 గంటలకు బదులు ఈ నెల 31న 45 నిమిషాలు , జూన్ 3వ తేదీన 30 నిమిషాలు ఆలస్యంగా విశాఖపట్నం నుంచి బయలుదేరుతుంది. ప్రయాణికులు మార్పులను గమనించి తమ ప్రయాణాలను రైళ్ల వేళలకు అనుకూలంగా మార్చుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో 14 మంది ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:జిల్లా స్థాయి వూషు సెలక్షన్స్‌లో 14 మంది సెలక్టు అయ్యారు. అందులో గొలుగొండ, మాకవరపాలెం, తుని, చెట్టుపల్లి, నర్సీపట్నం, అనకాపల్లి నుండి 37 మంది బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలు నర్సీపట్నం మినీ స్టేడియంలో ఉదయం 6 గంటల నుండి నిర్వహించారు. మహిళల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరిలో జరిగింది. ఇందులో మొదటి స్థానాలలో ఉన్న 14 మంది విజేతలను ఫైనల్‌గా సౌత్ జోన్ నేషనల్ కర్ణాటక పంపిస్తారని సీనియర్ కోచ్ యర్రా శేఖర్ తెలిపారు. ఈ పోటీలకు రిఫరీగా వూషు ఎన్ఐఎస్ కోచ్ వేపాడ ప్రియాంక నిర్వహించినట్లు చెప్పారు. వెయిట్ బరువు బాలికలు 27 కేజీల నుండి 66 కేజీలలో మాత్రమే పాల్గొన్నారు.

కచ్చితమైన ఫలితాలు ప్రకటించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి-పాడేరు:
భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ, ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టాలని, త్వరిత గతిన కచ్చితమైన ఫలితాల ప్రకటనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీనియర్ డిప్యూటి ఎలెక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుదవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించిన వ్యాస్ మాట్లాడుతూ, జిల్లాలో కౌంటింగ్ కు చేపట్టిన ఏర్పాట్లను, శాంతి భద్రతలకు తీసుకున్న చర్యలపై ఆరా తీసారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. విజయ సునీత మాట్లాడుతూ, జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వాటి ఓట్ల లెక్కింపునకు పాడేరు, రంపచోడవరంలో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అరకు పార్లమెంట్ సిగ్మెంట్లకు, నియోజక వర్గాలకు సంబంధించి వేర్వేరు కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేసామన్నారు. మీడియా సెంటర్, అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లను నియమించామని, నిరంతర విధ్యుత్ సరఫరాకు, సిసి కెమెరాల పర్యవేక్షణకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ, పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకున్నామని, గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీస్, కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులను కేటాయించామని తెలిపారు. 22 చెక్ పోస్టులు, 43 పికెట్స్ ఏర్పాటు చేసామని, ట్రాఫిక్ క్రమభాద్దీకరణ చర్యలు చేపట్టడం జరిగిందని వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యు అధికారి బి.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

డైవింగ్ సపోర్టు నౌక సీ ట్రయల్స్ సక్సెస్!

త్వరలో నేవీకి అప్పగింత
మరో డిఎస్‌వి 2029 నాటికి నిర్మించనున్న షిప్‌యార్డు



ఈ నెల 27వ తేదీన ట్రయల్స్ ప్రారంభిస్తున్న షిప్‌యార్డు అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
పూర్తిగా దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో దేశ రక్షణ అవసరాల నిమిత్తం విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డులో నిర్మాణంలో ఉన్న 2 డైవింగ్ సపోర్టు వెస్సెల్ (డిఎస్‌వి)ల్లో నిస్తార్ వెసెల్ ఈనెల 27న షిప్‌యార్డులో విజయవంతంగా సీ ట్రయల్స్ నిర్వహించింది. భారత నౌకాదళానికి త్వరలో దీన్ని అప్పగించేందుకు సీ ట్రయల్స్‌ను షిప్‌యార్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సముద్ర జలాల్లో శక్తి సామర్థ్యాలను పరీక్షించిన తర్వాత భారత నౌకాదళానికి దీన్ని అప్పగించాలని అధికారులు భావిస్తున్నారు. ఇండియన్ నేవీలో గల యుద్ధ నౌకలు, సబ్ మెరైన్‌లకు సపోర్టుగా సముద్రంపై ఈ డిఎస్‌విలు సేవలందించేందుకు ఉద్దేశించినవి. నిస్తార్, నిపుణ్ అనే 2 డిఎస్‌విలు హిందుస్థాన్ షిప్‌యార్డుకు గతంలో టెండర్‌లో వచ్చాయి. 1993లో కొరియా సహకారంతో ఐఎన్ఎస్ సుజాత యుద్ధ నౌకను షిప్‌యార్డులో నిర్మించారు. తాజాగా షిప్‌యార్డులో నిస్తార్ పూర్తికాగా నిపుణ్ యుద్ధ నౌక నిర్మాణ ప్రక్రియ నడుస్తోంది. అలాగే 5 ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్ఎస్)ల నిర్మాణాన్ని కూడా షిప్‌యార్డు నిర్వహించనుంది. వీటిలో 2 హిందుస్తాన్ షిప్‌యార్డు నిర్మించనుంది.

డిఎస్‌విల ఖర్చు రూ.2000కోట్లు..

డైవింగ్ సపోర్టు షిప్ (డిఎస్‌వి)లతో సుమారు రూ.2000కోట్ల కాంట్రాక్టు గతంలోనే షిప్‌యార్డు టెండరులో దక్కించుకుంది. ఈ షిప్‌ల నిర్మాణంతో షిప్‌యార్డుకు ఆర్థికంగా లాభించకపోయినా శక్తి, సామర్థ్యం నిరూపించుకోడానికి వీటి నిర్మాణాలు దోహదపడతాయని ఉద్యోగులు చెబుతున్నారు. ఎఫ్ఎస్ఎస్‌ల ద్వారానే అత్యధికంగా లాభం రానుంది. కానీ ఈ 5 షిప్‌యార్డుకు దక్కడం లేదు. 1, 4, 5 ఎఫ్ఎస్ఎస్‌లను షిప్‌యార్డు నిర్మించనుంది. 2, 3 ఎఫ్ఎస్ఎస్‌లను ఎల్అండ్‌టి నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 5 ఎఫ్ఎస్ఎస్‌లూ షిప్‌యార్డే చేపడితే సుమారు రూ.19వేల కోట్లు దక్కి ఉండేది.

12మంది ఆర్ఎంపిలకు నోటీసులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురంలో ఆర్ఎంపి క్లినిక్ కేంద్రాలను బుధవారం కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారి హరిప్రవీణ్ తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. శిక్షణ పొందిన మేరకే వైద్యం అందించాలని సూచనలు చేసి నోటిసులు జారీ చేశారు. సుమారు 12 మంది ఆర్ఎంపి వైద్యులకు నోటీసులు అందజేశారు. పరిధికి మించివైద్య సేవలు అందించకూడదని, ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని ఆయన తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

నేరాలు ఘోరాలు



బోల్తా పడిన ఆటో

ఆటో బోల్తా : ఆరుగురికి గాయాలు
ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- చింతపల్లి: ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.మండలంలోని అన్నవరం వంతెన సమీప మలుపు వద్ద బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది.ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు... జి.మాడుగుల మండలం పులపాడు నుంచి గూడెంకొత్తవీధి మండలం వంచుల గ్రామానికి శుభకార్యం నిమిత్తం డ్రైవర్‌తో కలిపి ఎనిమిది మంది ఆటోలో వెళ్తున్నారు. అన్నవరం గ్రామ సమీపంలో మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. తక్షణం స్పందించిన స్థానికులు క్షతగాత్రులను ద్విచక్ర వాహనాలపై లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఉగ్రంగి కనకమహాలక్ష్మి తలకు తీవ్ర గాయమవ్వడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్
81 వాహనాలు సీజ్

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో 47 వాహనాలను పోలీసులు సీజ్ చేసారు. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల సిఐలు విజయకుమార్, అప్పన్న, నాలుగు మండలాల ఎస్ఐ ల ఆధ్వర్యంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాహనాలకు సంబంధించి సరైన రికార్డులు లేనందున 47 వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ విజయ్ కుమార్ వెల్లడించారు. వీటిలో 45 టూ వీలర్స్, ఒక కారు, ఒక ఆటో ఉన్నట్లు తెలిపారు. వాహనదారులు రికార్డులు సమర్పిస్తే వాటిని మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్‌కు పంపిస్తామని, రికార్డులు పక్కాగా ఉన్న వాహనాలను వాహనదారులకు అందజేస్తామన్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులపై చర్యలు తీసుకుం టామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా వెహికల్ రికార్డులు, లైసెన్సులు కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్డెన్ సెర్చ్‌లో నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, కోట ఊరట్ల మండలాల ఎస్ఐలు గఫూర్, విభూషణరావు, రామారావు ,రామకృష్ణ పాల్గొన్నారు .

కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో దొండపూడి, మత్స్యవానిపాలెం గ్రామాలలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలోఎస్సై లక్ష్మణరావు సర్కిల్ పరిధిలో సిబ్బంది పాల్గొని బుధవారం తెల్లవారుజాము నుంచే ముఖ్యమైన కూడళ్ళు, గ్రామ శివార్లకు వెళ్ళి వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేని 34 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్, రెండు కారులను స్వాధీనం చేసుకొని స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ అప్పల నాయుడు మాట్లాడుతూ, ఎన్నికల ఫలితాలు వెలువడే సమయం దగ్గర పడుతున్నందున గ్రామాలలో శాంతి భద్రతలకు విఘతం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ పరిధిలో కొత్తకోట, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట ఎస్సైలు లక్ష్మణరావు, సురేష్, ధనుంజ యనాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యావసరాలు, రోడ్లు సిద్ధం చేయండి

ప్రజాశక్తి- కూనవరం : పోలవరం ప్రాజెక్ట్ వల్ల ప్రతి ఏటా ముంపుతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ ఏడాదైనా సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, నిత్యావసరాలు, రోడ్లు సిద్ధం చేయాలని మండల తహసీల్దార్‌కి సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో ముందుగానే బియ్యం, కిరోసిన్, ఇతర నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచాలని కోరారు. కోతులగుట్ట నుండి, ఏడుగురాళ్ల పల్లి మీదుగా రోడ్డును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. గత కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా నిధులు మంజూరు చేసినా ఇప్పటికి వరకు రోడ్డు సరి చేయలేదని పేర్కొన్నారు. మళ్ళీ గోదారి వస్తే భద్రాచలం వెళ్ళడానికి అదే ఏకైక రహదారి అని, కాబట్టి త్వరిత గతిన పూర్తి చేయాలని కోరారు. గతేడాది తార్పలిన్లు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని, నిత్యావసరాలను అధిక ధరలకు అమ్ముతున్నా కట్టడి చేయలేదని పేర్కొన్నారు. ప్రతి పునరావాస కేంద్రంలో మంచి నీటి వసతి, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన తహసీల్దార్ వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ వరద బాధితులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎంపిటిసిలు అమ్మాజీ, జయసుధ, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, పాయం సత్యనారాయణ, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్ పాల్గొన్నారు.

2న 'దర్శిని' విజయోత్సవ సభ

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరానికి చెందిన వికాస్, శాంతి హీరోహీరోయిన్లుగా, డాక్టర్ అల్లు ప్రదీప్ దర్శక పర్యవేక్షణలో, వి4 క్రియేషన్స్ పతాకంపై, డాక్టర్ ఎల్‌వి. సూర్యం నిర్మించిన దర్శిని చిత్రం రెండు వారాల క్రితంఉభయ తెలుగు రాష్ట్రాల్లో, 100కు పైగా థియేటర్లో విడుదలై, అమిత ప్రేక్షకాదరణ పొందిన నేపథ్యంలో వచ్చేనెల 2న ఆదివారం మధ్యాహ్నం, 2గంటలకు స్థానిక పౌరగ్రంథాలయంలో విజయోత్సవ అభినందన సభ నిర్వహించనున్నట్లు రంగ స్థాయి ప్రతినిధి, వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు. బాదంగిరి సాయి తెలిపారు. 'మేకింగ్ దర్శిని మూవీ' పేరిట ఉచిత చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. విశాఖకు చెందిన చిత్ర హీరోహీరోయిన్లు, దర్శకుడితోపాటు సాంకేతిక వర్గాన్ని అభినందించి, సత్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో స్టార్ మేకర్ యల్.సత్యానంద్, నగర ప్రముఖులు పాల్గొంటారని, సినీ ప్రియులు, ఔత్సాహిక దర్శకులు, నిర్మాతలు, సినీనటులు, ప్రేక్షకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

1న గిరిజన గురుకులాల్లో ప్రవేశాలు

ప్రజాశక్తి-మధురవాడ : సిబిఎస్ఇ సిలబస్‌లో విద్యాబోధన సాగుతున్న విశాఖ, మారికవలసలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ఎంపికైన విద్యార్థులంతా జూన్ ఒకటో తేదీన ప్రవేశాలు పొందాలని పాఠశాల ప్రిన్సిపల్ ఎల్.శివప్రసాద్ తెలిపారు. ఒకటిన శనివారం ఉదయం 10 గంటల నుండి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు. ఇప్పటికే ఎంపికైన విద్యార్థులకు ఫోన్, కాల్ లెటర్స్ ద్వారా సమాచారం పంపామన్నారు. ఎంపికైన విద్యార్థులంతా అర్హత ధ్రువీకరణలతో ప్రవేశాలకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు పాడేరు ఐటిడిఎలోని గురుకులం సెల్‌లో నోటిస్ బోర్డులో తెలుసుకోవచ్చన్నారు. అదనపు సమాచారం కొరకు 9502956307, 9490957232 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ ఏడాది నుంచి మారికవలస గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో సిబిఎస్ఇ విధానంలో విద్యాబోధన సాగుతుందని ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు.

పోలీసులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ సిబ్బందికి బుధవారంఆక్సిలెట్ ల్యాబ్స్ సహకారంతో వైద్యఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని స్థానిక సిఐ వై.రామకృష్ణ పర్యవేక్షించారు. పిఎంపాలెంలో 155 మంది సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నగర పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న లోకల్ పోలీసులతోపాటు ఆర్మ్డ్ రిజర్వ్, హోంగార్డ్‌లకు నగర పోలీస్‌కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ కృషితో, ఆక్సిలేట్ ల్యాబ్ సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఆక్సిలేట్ ల్యాబ్ డైరెక్టర్ పిసిఎం రాజు మాట్లాడుతూ గుండెకు సంబంధించి ఇసిజి, లిక్విడ్ ప్రొఫైల్, కిడ్నీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, థైరాయిడ్, మధుమేహ పరీక్షలు, యూరిన్ ఎనాలసిస్‌తో కలిపి సుమారు 60 రకాల పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో క్యాంప్ మేనేజర్ సురేష్, టెక్నీషియన్లు భవాని, ఇందుప్రియ, నరేష్, రాజు పాల్గొన్నారు

అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం

రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం : బాధితులకు జెకెసి ట్రస్ట్ ఆర్థికసాయం





అగ్నిప్రమాదంలో దగ్ధమైన పూరిల్లు... బాధితులకు సాయం అందజేస్తున్న ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్‌ఖాన్

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని గొమ్ముగూడెం గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కంటె బాబురావు చెందిన పూరిల్లు, కోకిరాల అనంతరావు వంట పాకకు బుధవారం మధ్యాహ్నం ప్రమాదవ శాత్తు నిప్పు అంటుకుంది. స్థానికుల సమాచారం మేరకు అగ్ని మాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించి శకటాన్ని తీసుకొచ్చినా నీళ్ల పైపు పని చేయకపోవడంతో బిందెలతో గ్రామస్తులు శ్రమించి మంటలను ఆదుపు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎట్టకేలకు కొంత సమయం ఆగిన తరువాత పైపు పని చేయడంతో వెంటనే పూర్తిగా మంటలను అదుపులోకి ఫైర్ సిబ్బంది తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఆ సమయంలో ఇంటి దగ్గర బాధితులు లేకపోవడంతో ఇంట్లో ఉన్న సామాన్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. బాధితులు రోడ్డున పడ్డారు. సుమారు రూ.2లక్షలు వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు లబోదిబోమంటున్నారు. సంఘటనా స్థలాన్ని స్థానిక ఎంపిటిసి కారం జయసుధ సందర్శించి బాధితులను ఓదార్చారు. అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

బాధితులకు జెకెసి ట్రస్టు ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయం

గొమ్ముగూడెం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధమై రోడ్డున పడ్డ బాధితులకు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ తన జెకెసి ట్రస్టు ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న జమాల్‌ఖాన్ సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. బాధితులు కంటెం బాబురావు, కొక్కిరాల అనంతరావుకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేలు చొప్పున ఇద్దరికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఇంటి నిర్మాణానికి కావలసిన సామాగ్రిని త్వరలో అందజేస్తామని జమాల్‌ఖాన్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సూఫీ, శ్రీమంతుల వెంకట రమణ, సర్పంచ్ సొందే రామయ్య, కొక్కిరాళ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఉద్యోగ నియామకాలతో మోసపోవద్దు

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యుత్ శాఖలో ఉద్యోగాలిప్పిస్తామని, నకిలీ నియామక పత్రాలతో మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీన్ని నిరుద్యోగులు నమ్మవద్దని ఎపిఇపిడిసిఎల్, హెచ్ఆర్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఇపిడిసిఎల్ ప్రస్తుతం ఎటువంటి నియామక ప్రక్రియ చేపట్టడం లేదని స్పష్టం చేసారు. ఉద్యోగ నియామక ప్రక్రియ చేపడితే సంస్థ వెబ్‌సైట్‌లోనూ, ప్రముఖ తెలుగు, ఆంగ్ల దినపత్రికలలోనూ ఉద్యోగ ప్రకటన నోటిఫికేషన్‌ను ప్రచురించి, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నియామకాలు నిర్వహిస్తామన్నారు.
సబ్ స్టేషన్ల నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టు ప్రాతిపదికన నిర్వహించేందుకు కాంట్రాక్టర్లతో సంస్థ ఒప్పందం కుదుర్చుకుంటుందని, అందులో పనిచేసే సిబ్బందితో కానీ, వారి నియామక ప్రక్రియతో కానీ ఎపిఇపిడిసిఎల్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసారు. సంస్థ పేరున నియామక పత్రాలను జారీకి కాంట్రాక్టర్లకు ఎటువంటి అనుమతి లేదన్నారు. అయినప్పటికీ విద్యుత్ సబ్ స్టేషన్లలోకాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు నకిలీ నియామక పత్రాలను ఇచ్చి మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎపిఇపిడిసిఎల్‌లో ఉద్యోగ నియామకాల కోసం www.apeasternpower.com వెబ్‌సైట్‌ను గానీ, సంస్థ కార్పొరేట్ కార్యాలయంలోని హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ సిజిఎంను నేరుగా సంప్రదించి వివరాలను తెలుసుకోవచ్చన్నారు.

రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి- సీతమ్మధార : రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రతపై కిశోర బాలికలు, మహిళలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. బుధవారం రుతుక్రమ ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా రైల్వే న్యూకాలనీ యుపిహెచ్‌సి వద్ద ఆర్‌బిఎస్‌కె సమన్వయకర్త డాక్టర్ ఎన్.సమత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ రుతుక్రమమనేది మహిళలలో జరిగే సాధారణ ప్రక్రియ అని, దీనిపై లేనిపోని అపోహలు, ఆంక్షలు ఉన్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. అయితే ఆ సమయంలో పరిశుభ్రతపై కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బి.నాగేశ్వర రావు, రైల్వే న్యూ కాలనీ యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దివ్య, ఆర్‌బిఎస్‌కె కన్సల్టెంట్ డాక్టర్ హీనా దీక్షిత్, కౌన్సెలర్ ఆర్.సత్యవతి, డిఇఐసి మేనేజర్ శాంతిప్రియ, ఎంపిహెచ్ఇఒ నాగభూషణం, ఎఎన్ఎంలు, ఆశాలు, కిశోర బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యల హాజరై పూజలు చేశారు. అనంతరం స్వామివారి సన్నిధిలో భారీ అన్న సమారాధన భక్తుల ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎయు విసి ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'ట్రెండ్స్ ఇన్ ఎమర్జింగ్ నానో బయోటెక్నాలజీ.. కరెంట్ అప్లికేషన్స్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్టస్' అనే అంశంపై జులై 15న టిఎల్ఎన్. సభ హాల్‌లో జాతీయస్థాయి సదస్సును నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఎయు విసి. ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు , ఎకాడమిక్ ఎఫైర్స్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు,సదస్సు కన్వీనర్ ఆచార్య పి.రాధిక తదితరులు పాల్గొన్నారు .